చిగురుటాకులా వణికిన నగరం

- శుక్రవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం
- నగరంలో పలుచోట్ల కూలిన చెట్లు, తెగిన విద్యుత్ వైర్లు
- మూడు వంతెనలు వద్ద ట్రాక్ ఎక్స్‌టెన్షన్ చేసినప్పటికీ భారీ స్థాయిలో నిలిచిపోయిన మురుగు
- రోడ్లన్నీ జలమయం
- వీధుల్లో పేరుకున్న చెత్త
- అవస్థలు పడిన నగరవాసులు



ఏటీ అగ్రహారం 4వ లైనులో నిలిచిన వర్షం నీరు

నెహ్రూనగర్: నగరంలో శుక్రవారం తెల్లవారు జామున 2.30 గంటల నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో భారీ చెట్లు నెలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో కరెంట్ లేకపోవడంతో నగర వాసులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికే నగరంలోని రోడ్లన్నీ చెత్తా, చెదారం, మురుగు నీటితో నిండిపోయాయి. నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేలకొరిగిన భారీ చెట్లు

అరండల్‌పేట 1వ లైనులోని భారీ వేప చెట్టు నేలకూలింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సిబ్బందితో చెట్టును పక్కకు తప్పించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డులో కేంద్ర మంత్రి పెమ్మసాని కార్యాలయం వద్ద కూడా భారీ చెట్టు నేల కూలింది. పాత గుంటూరులోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలాయి. దీంతో పాటు వెంగళరావునగర్‌లో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. పవర్ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

మళ్లీ మూడు వంతెనల వద్ద మురుగు

కొద్ది నెలల కిందట మూడు వంతెనల వద్ద ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనుల నిమిత్తం రూ.5 కోట్లు దాకా ఖర్చు పెట్టి రైల్వే పనులు చేపట్టారు. దీంతో అక్కడ మురుగు సమస్య ఉండదని నగర వాసులు అభిప్రాయపడ్డారు. అయితే, శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో మూడు వంతెనలు మొత్తం మురుగుతో పూర్తిగా నిండిపోయింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మురుగు తొలగింపు ప్రక్రియ శుక్రవారం సాయంత్రం వరకు పట్టిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎండ కాలంలోనే ఈ విధంగా ఉంటే వర్షకాలంలో ఇంకా మూడు వంతెనల వద్ద పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అని సోషల్ మీడియాలో మురుగును వీడియో తీసి నెటిజన్స్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. కంకరగుంట ఫ్లైఓవర్ కింద కూడా భారీ స్థాయిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో మోటార్ల సాయంతో అధికారులు బెయిల్ అవుట్ చేశారు.



మెడికల్ కళాశాల రోడ్డులో నిలిచిన వర్షం నీరు

రోడ్లన్నీ చెత్త మయం

నగరంలో చెత్త తరలింపు సక్రమంగా జరగకపోవడం, ఇంటింటికీ సేకరణ నూరు శాతం జరగకపోవడంతో నగరవాసులు చెత్తను రోడ్ల మీద, కాలువల్లో వేస్తున్నారు. దీంతో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కాలువల్లో మురుగు సక్రమంగా పారకపోవడంతో ఆ చెత్త అంతా రోడ్ల మీదకు వచ్చేసింది. చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటర్ బాటిళ్లు ఎటు చూసినా కనిపించాయి.

హోర్డింగ్స్ పరిస్థితి ఏంటో?

నగరంలో రోడ్డు అడ్డంగా వేల కేజీల బరువుతో ఏర్పాటు చేసిన 40 గ్యాంట్రీ హోర్డింగ్స్ భవిత్యం ప్రశ్నార్థకంగా మారింది. ఎంఓయూలో హోర్డింగ్స్‌కు 10 X20 సైజు చూపించి 30 X17 సైజుల్లో ఏర్పాటు చేశారు. 10 X20 సైజుకు మాత్రమే స్టెబిలిటీ సర్టిఫికెట్ ఉంది. దీనికి తోడు ఎల్ఈడీ స్క్రీన్స్ కూడా ఏర్పాటు చేయడంతో బరువు మరింత పెరిగిపోయింది. దీంతో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి, గాలీ, దుమారాలకు గ్యాంట్రీ హోర్డింగ్స్ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఎప్పుడు కూలి ప్రాణ నష్టం వాటిల్లుతుందోనని నగరవాసులు భయాందోళనలో ఉన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షాలు

నగరంపాలెం: నగరంలో గురువారం అర్ధరాత్రి దాటాక కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయ్యాయి. పెద్ద చెట్లు నేలకొరిగాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అశోక్‌నగర్ గ్యాస్ గొడౌన్ రోడ్డులో రెండు భారీ వృక్షాలు విరిగిపోయాయి. రహదారికి చెట్లు అడ్డంగా పడిపోవడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. అదే వీధిలో ఓ సిమెంట్ విద్యుత్ స్తంభం సగానికి విరిగి పోయింది. ఆ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. కొత్త సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. హౌసింగ్ బోర్డు, చంద్రమౌళీనగర్, రామన్నపేట, బ్రాడీపేటతోపాటు నగర శివారు ప్రాంతాలు మురుగుతో అస్తవ్యస్తంగా మారాయి. కాల్వల్లోని పూడిక రహదారి పైకి చేరింది. నడిచేందుకు వీల్లేకుండా తయారయ్యాయి. పలు బహుళ అంతస్తుల్లోని సెల్లార్‌లు నీట మునిగాయి. పార్కింగ్ చేసిన వాహనాలు సగానికి మునిగిపోయాయి. పలువురు మోటార్ల సాయంతో వర్షపు నీటిని తొలగించుకున్నారు. జెడ్పీ కార్యాలయ ఆవరణలోని ఖాళీ స్థలంలో నీరు నిలిచి చెరువుని తలపించింది.



జెడ్పీ కార్యాలయం సమీపంలోని ఖాళీ స్థలంలో నిలిచిన నీరు

నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

నెహ్రూనగర్: రాబోవు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనల మేరకు నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. నగరంలో విరిగిన చెట్లు, హోర్డింగ్స్‌ని తొలగించడం, నీరు నిలిచిన ప్రాంతాల్లో బెయిల్ అవుట్‌ను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. ఆయన శుక్రవారం మూడు వంతెనలు, అరండల్ పేట, అమరావతి రోడ్, విద్యానగర్ మెయిన్ రోడ్, మారుతీనగర్, కంకరగుంట ఆర్‌యూబీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం వల్ల ప్రజలకు సమస్య తలెత్తకుండా నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని చెప్పారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు, చెట్లు విరిగి ట్రాఫిక్‌కి అడ్డుగా ఉన్నా, వర్షం నీరు నిలిచినా తక్షణం జీఎంసీ కాల్ సెంటర్ 08632345103, 104, 105 నంబర్లకు చేస్తే సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు. నోడల్ అధికారులు, ఇతర సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉండాలని, విభాగాధిపతులు ఎక్కడా సమస్య రాకుండా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. మూడు వంతెనల వద్ద నిలిచిన సిల్ట్‌ని జెట్టింగ్ మెషీన్ల ద్వారా శుభ్రం చేయాలని, కంకర గుంట ఆర్‌యూబీ వద్ద అదనపు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని బెయిల్ అవుట్ చేయాలని డీఈఈని ఆదేశించారు. విరిగిన చెట్లను తొలగించడానికి ఉద్యాన సిబ్బందిని అందుబాటులో ఉంచి, కాల్ సెంటర్ నుంచి వచ్చిన ఫిర్యాదులకు తక్షణం హాజరుకావాలని తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయం వల్ల తాగునీటి సరఫరాకి సమస్య లేకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఈఈలను ఆదేశించారు. మెయిన్ డ్రైయిన్లలోకి చిన్న డ్రైయిన్లు కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద వ్యర్థాలను ప్రజారోగ్య కార్మికుల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించేలా పర్యవేక్షణ చేయాలని సీఎంఓహెచ్‌ని కమిషనర్ ఆదేశించారు. నగరంలో పలు ప్రాంతాల్లో హోర్డింగ్స్ విరిగి, బ్యానర్లు గాలికి ఎగురుతున్నాయని, వాటిని తక్షణం తొలగించాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవన యజమానులు వర్షాలకు జాగ్రత్తలు తీసుకోవాలని, శిథిలావస్థలో ఉన్న పురాతన భవన యజమానులకు నోటీసులు ఇవ్వాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ మధుసూదన్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు



మెడికల్ కళాశాల రోడ్డులో నిలిచిన వర్షం నీరు



గణేష్‌రావుపేటలో పేరుకున్న చెత్త



గుంట గ్రౌండు ఎదుట చిరిగిన ఫ్లెక్సీ బోర్డులు



గణేష్‌రావుపేటలో పేరుకున్న చెత్త

ప్రాంతీయ గ్రంథాలయ అభివృద్ధికి కృషి

తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు ఎడ్యుకేషన్: శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.2.50 లక్షల వ్యయంతో 100 కుర్చీలు, వాటర్ ఫిల్టర్, రీడింగ్ ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో ముందుగా అమర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. ప్రాంతీయ గ్రంథాలయాన్ని డిజిటల్‌గా ఆధునీకరించేందుకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లి ఎంపీ గ్రాంటు నిధులను తీసుకువస్తామని తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాంతీయ గ్రంథాలయ రూపురేఖలు మార్చివేసి ఆధునీకరణకు ప్రభుత్వానికి రూ.ఎనిమిది కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల ప్రయోజనార్థం ప్రాంతీయ గ్రంథాలయాన్ని సెలవు రోజుల్లో సైతం తెరిచే విధంగా చైర్మన్, ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించగా, దానిపై వారు అక్కడే గ్రంథాలయాధికారికి లిఖితపూర్వకంగా ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు, ఉద్యోగార్థుల ప్రయోజనార్థం ఇటీవల రిఫరెన్స్ పుస్తకాలతో పాటు తాజాగా రూ.2.50 లక్షల విలువైన సామగ్రి అందజేసిన ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులను ఎమ్మెల్యే నసీర అహ్మద్‌తో పాటు గోనుగుంట్ల కోటేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథ పాలకురాలు అక్కినేని అచ్చమాంబ, గ్రంథాలయ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్తమ్మ, గ్రంథాలయ ఉద్యోగుల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గేదెల శివప్రసాద్, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

సైబర్ నేరాలపై ప్రజలకు అప్రమత్తత అవసరం

రూ.60 లక్షల విలువ చేసే 300 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత

నగరంపాలెం: సెల్‌ఫోన్ల ద్వారా జరిగే సైబర్ నేరాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో వాటిని అప్పగించారు. రూ.60 లక్షల విలువ చేసే 300 ఫోన్లను గుర్తించి, బాధితులకు ఉచితంగా అందజేసినట్లు ఆయన చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నామని చెప్పారు. ఇప్పటి దాకా రూ.5.80 కోట్లు విలువైన 2,900 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించామని తెలిపారు. సెల్‌ఫోన్లు పోయిన వెంటనే జాతీయ సైబర్ క్రైం నంబర్ 1930కు లేదా పోలీస్ సహాయత నంబర్ 8688831574 లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు ఇవ్వాలని ఆయన సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఫోన్ల రికవరీకి కృషిచేసిన ఐటీ కోర్ సీఐ నిషార్ బాషా, హెచ్‌సీలు కిశోర్, రమేష్, కానిస్టేబుళ్లు శ్రీధర్, మానస, కరీముల్లాను జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు, ఎస్‌బీ సీఐ అలహరి శ్రీనివాస్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళకు మొబైల్‌ఫోన్ అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతాప్ కుమార్ రావులకు సీఎస్ఈ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. 'డిటెక్షన్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ వార్మ్‌హోల్ అటాక్స్ ఇన్ ఏ వెహికులర్ అడహక్ నెట్‌వర్క్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయన తన పరిశోధనలో భాగంగా 4 స్కోపస్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతాప్ కుమార్ రావులను పలువురు అభినందించారు.

పర్యావరణ కాలుష్యాన్ని అడ్డుకోవాలి

నెహ్రూనగర్: పర్యావరణ కాలుష్యాన్ని అడ్డుకోవడంతో వేడి వాతావరణాన్ని తగ్గించుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. వాతావరణ కాలుష్య నియంత్రణపై ఐటీసీ ఫినిష్ సంస్థ శుక్రవారం రూపొందించిన వాల్‌పోస్టర్‌ని కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యల్లో పర్యావరణ కాలుష్యం ఒకటని తెలిపారు. నియంత్రణకు ప్రభుత్వాలు, సంస్థలతో పాటుగా ప్రజలు కూడా వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నగరంలో చలివేంద్రాలు, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్స్ వద్ద నీడ వచ్చేలా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వం ప్రతి 3వ శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈసారి బీట్ ది హీట్ నినాదం ఇచ్చిందని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా నగరంలోని వార్డ్ సచివాలయాల వారీగా ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వివిధ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యులు కావాలని ఆయన కోరారు. ప్రజలకు వాతావరణ కాలుష్యం, ప్రమాదాలు, నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని ఆయన వెల్లడించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

మాయల మాంత్రికుడు మోదీ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

లక్ష్మీపురం: కేంద్రంలో అధికారం చలాయిస్తున్న నరేంద్ర మోదీ మాయల మాంత్రికుడని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. సీపీఐ గుంటూరు జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశం శుక్రవారం మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. ఆదేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ మాయమాటలను నమ్మే పరిస్థితులలో ప్రజలు లేరని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరోసారి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులు కట్టలేక అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సీపీఐ మహాసభలు జరుగుతాయని, అందులో భాగంగా సెప్టెంబర్‌లో ఛండీగఢ్‌లో జాతీయ మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. ఆగస్టు 22-24 తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరుగబోతున్నాయని వెల్లడించారు. వీటికంటే ముందు మండల, నియోజకవర్గ, జిల్లా మహాసభలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు ముప్పాళ్ల పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల

వర్షంలోనూ సీహెచ్‌ఓల నిరసన

లక్ష్మీపురం: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖలోని సీహెచ్‌ఓలు శుక్రవారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సమ్మె చేపట్టారు. జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓల సమ్మె 19వ రోజుకు చేరుకుంది. యూనియన్ గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లగా పని చేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎంలో ఆరు సంవత్సరాల నుంచి సీహెచ్‌ఓలుగా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న తమ సమస్యలు పరిష్కరించకపోవడం శోచనీయమని తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షురాలు జి. వనజ మాట్లాడుతూ రెగ్యులరైజేషన్, వేతన సవరణ, ప్రావిడెంట్ ఫండ్ తదితర సమస్యలను త్వరితగతిన చర్చలు జరిపి, స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సీహెచ్‌ఓలు నిరవధిక సమ్మె చేస్తున్న పట్టించుకోకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం బాధాకరమని ఖండించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజిబాబు, జిల్లాకో ఆర్డినేటర్ దీక్షిత, జిల్లా నాయకులు జీవనజ్యోతి, శోభారాణి, కె.లక్ష్మి, సుభాని, జహీర్, టి.సిరి, ఐ.జ్యోతి, జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయ వద్ద వివాదం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం వివాదం చోటు చేసుకుంది. రోడ్ల మీద తిరుగుతున్న ఆవులను నగరపాలక సంస్థ సిబ్బంది పట్టుకొని వేరే ప్రాంతానికి తరలించే క్రమంలో మున్సిపల్ సిబ్బందికి, వాటి యజమానులకు వాగ్వివాదం చోటు చేసుకుంది. ఇందులో ఆవుల యజమాని ఒకరు మున్సిపల్ సిబ్బందిపై చేయి చేసుకున్నాడు. అటుగా వెళుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు సిబ్బందిపై చేయి చేసుకుంటావా ? అంటూ ఆగ్రహంతో ఒక దెబ్బ కొట్టినట్లు సమాచారం.

నగరపాలక సంస్థ ఏటీఓ సరెండర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ టెండర్లలో అవకతవకలకు పాల్పడిన ఏటీఓ (అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్) భవ్య సాయిని ఈఎన్‌సీ (ఇంజనీర్ ఇన్ చీఫ్)కి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సరెండర్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు(గుంటూరు): 11 కేవీ లైన్ మెయింటెనెన్స్ కారణంగా జేకేసీ రోడ్డు, విజయపురి కాలనీ, తారకరామా నగర్, గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎస్ కాలనీ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు టౌన్-2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

జీజీహెచ్ 'మీ కోసం మేము' నిర్వహణ



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్, పేషెంట్ ఇంట్రాక్షన్ కార్యక్రమం 'మీ కోసం మేము'ను శుక్రవారం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'బీట్ ద స్ట్రోక్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో రోగుల సహాయకులకు వేసవిలో ఆహార నియమావళిపై అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో సాధారణ నియమావళి పాటించాలని, సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం పేద రోగుల కుటుంబాలకు 25 కేజీల బియ్యం, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి వాట్సాప్, మెయిల్స్ ద్వారా సమస్యల వినతి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు దశలవారీ ఉద్యమంలో భాగంగా ప్రతిపాదించిన డిమాండ్లను మంత్రి నారా లోకేష్‌కు వాట్సాప్, మెయిల్ ద్వారా పంపుతున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మొహ్మద్ ఖాలీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి గానూ లోకేష్ వాట్సాప్ నంబరు 99992 99999తో పాటు L.na-ra@ap.gov.in మెయిల్‌కు ఉపాధ్యాయులందరూ పంపాలని ఆయన కోరారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 18,19,20వ తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ, మంత్రులు, జెడ్పీ చైర్మన్లకు వినతి పత్రాలు సమర్పిస్తామని తెలిపారు.

అలరించిన 'ఉత్తర గో గ్రహణం' తోలు బొమ్మలాట



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం తోలు బొమ్మలాట ప్రదర్శించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ సౌజన్యంతో శ్రీ షిర్డీ సాయి తోలు బొమ్మలాట బృందం (నరసరావుపేట) తెలుగు ప్రాచీన కళారూపం ఉత్తర గోగ్రహణం తోలు బొమ్మలాట ప్రదర్శించారు. పాండవుల అజ్ఞాత వాసం, బృహన్నల నాట్య గురుత్వం, కౌరవుల కుట్ర, ఉత్తర కుమారుని ప్రగల్భాలు, ఉత్తర గో గ్రహణం చేసి కౌరవులను అర్జునుడు ఓడించిన ఘట్టాలను పద్యాలు, గేయాలు, వచనంతో ప్రదర్శించారు. ప్రేక్షకులను ఇవి అలరించాయి. అనంతరం కళాకారులను గుళ్లపల్లి రాఘవరావు సత్కరించారు.

20న 'శిశిరంలో గులాబీలు' ఆవిష్కరణ

నగరంపాలెం: లక్ష్మీపురంలోని ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఈనెల 20న శిశిరంలో గులాబీలు (ఎంసీ చాగ్లా ఆత్మకథ) ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు జయ చాముండేశ్వరి పబ్లికేషన్స్ నిర్వాహకులు కె.జయలక్ష్మి, చాముండేశ్వరి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రముఖ తెలుగు అనువాదకులు కందిమళ్ల శివప్రసాద్ రాసిన ఈ పుస్తక పరిచయ సభకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంక సూర్యనారాయణ గ్రంథావిష్కరణ చేస్తారని తెలియజేశారు.

ఈసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈసెట్ పరీక్షా ఫలితాల్లో జీవీఆర్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని సంస్థ డైరెక్టర్ తురకా వీరయ్య తెలిపారు. బ్రాడీపేట 2/4లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎస్ఈ విభాగంలో ఏ. దుర్గాప్రసాద్ 145 మార్కులతో రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంకు, ఎం.వి శాంత్‌కుమార్ 130, సీహెచ్ నవీన్ 145, ఆర్యన్ రాజేష్ 264, షేక్ నేహా 696, కె. సాయిస్వప్న 798, బి. కావ్య 849, డి. వాణి 1053వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఎలక్ట్రికల్ విభాగంలో ఎల్. కౌషిక్‌కుమార్ 140వ ర్యాంకు, సివిల్ విభాగంలో ఆర్. మణికంఠ 303, వి. శివ సందీప్‌రెడ్డి 481, జి. కీర్తి 853, ఈసీఈ విభాగంలో పి. తేజ 401, యశశ్విని 406, రాజరాజేశ్వరి 595, జీవీఎల్ శ్రావణి 532, వై. కావ్య భవాని 1053వ ర్యాంకు పొందారని ఆయన పేర్కొన్నారు.